కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :170 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 27-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## ప్రధాని మోదీతో ఆ మాట చెప్పండి నిరసనలు 30 సెకన్లలో ఆగిపోతాయి..



న్యూఢిల్లీ,సర్ పేరుతో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న ప్రతిపక్ష ఇండియా కూటమిఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేస్తూ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి లేఖ రాశాయి. ఈ లేఖపై ఆయన తాజాగా 'ఎక్స్' వేదికగా స్పందించారు.ఢిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను తాము వింటున్నామని, వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నామని రాహుల్‌గాంధీ అన్నారు. అయితేమెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసిందని, రోడ్లనూ మూసివేసిందని, దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచిందని విమర్శించారు. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పాలని, అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయని వ్యాపారులను ఉద్దేశించి రాహుల్ గాంధీ పేర్కొన్నారు.దీపావళి పండగ సీజన్‌లో ఢిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ పేర్కొన్నది. అయితే నవంబర్ 1న చేపట్టే నిరసన కారణంగా రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబర్ 10 తర్వాత నిరసనలు నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసింది.

## రాష్ట్రంలో నీటి సమస్యలపై దృష్టి పెట్టండి: రామచందర్ రావు



హైదరాబాద్: తెలంగాణలో తాగునీరు, సాగునీటి సమస్యలు నెలకొన్నాయని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి పరిస్థితులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర అంశాలపై దృష్టి సారిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 6 వేల చెరువుల్లో కేవలం 500 చెరువుల్లోనే నీళ్లు ఉన్నాయని, హైదరాబాద్‌లో 8 వేల తాగునీటి ట్యాంకర్లు తిరుగుతున్నాయని తెలియజేశారు. అయితే, ఈ గణాంకాలకు సంబంధించిన అధికారిక వివరాలు స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది. రాష్ట్రంలో నీటి సమస్యలపై దృష్టి పెట్టకుండా కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని రామచందర్ రావు విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ వల్ల ఎవరి ఓట్లు తొలగించబడ్డాయో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాహుల్ గాంధీ గురించి పదేపదే మాట్లాడుతున్నారని, తమ పదవులు, సీట్లు కాపాడుకునేందుకే రాహుల్ గాంధీ పేరును ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీలో ఎప్పటికప్పుడు ధిక్కార స్వరం వినిపించే సొంత పార్టీ ఎమ్మెల్యేలు చాలా మందే ఉన్నారని తెలిసిందే. ఎప్పుడూ ప్రభుత్వంపై తనదైన శైలిలో కౌంటర్లు వేసే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నిధుల విడుదలలో జాప్యం విషయంలో సర్కార్‌పై తనదైన శైలిలో చురకలంటించి రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపుతున్నారు.స్థానికంగా జరిగిన ఓ సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. జడ్చర్ల నియోజకవర్గంలో 30 వేల మందితో దీక్షలకు కూర్చుంటా. చచ్చిపోయేంత వరకు కూర్చుంటా.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నిధులియ్యాల్సిందే. రోడ్లు కంప్లీట్ చేయాల్సిందే. మనకు రోడ్లు ఇచ్చింది ఎవరు..? నా గురువు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. ఆయననే అడుగుతున్నా.. అన్నా కొబ్బరికాయకొట్టి పోయినవ్ అని ప్రశ్నించారు.మళ్లీ భట్టి విక్రమార్క పాదయాత్రకు వస్తే జడ్చర్లలో 30-40 వేల మందితో ఆ రోజు నేను సభ చేసిన. భట్టి విక్రమార్కను కూడా అడుతుగున్నా.. నా నియోజకవర్గంలో కొందరిలా మీరు బిల్లులు ఇయ్యండి.. లేకుంటే నేను ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుని.. ఇక చచ్చిపోనన్నా చనిపోతా కానీ నిధులు మాత్రం జడ్చర్లకు ఇయ్యాల్సిందే.. ఒకవేళ అనిరుధ్ రెడ్డి చచ్చిపోతెనే జడ్చర్లకు నీళ్లు ఇస్తామంటే.. నేను అమరణ నిరాహార దీక్షలో నేను చచ్చిపోతా.. ఆ తర్వాత నిధులు ఇయ్యండి.. ఓ నాగర్‌కర్నూల్ ఆర్‌అండ్ బీ కాంట్రాక్టర్ చచ్చిపోతే కోట్ల రూపాయలు ఇచ్చారు. మరి రూ.40 కోట్లు విలువనా..? లేదా నా ప్రాణం విలువనా..? అనేది మా ప్రభుత్వం నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హితవు పలికారు.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర సీఎం సానుకూలం.!





హైదరాబాద్,అక్టోబరు 26 : ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ వివాదాన్ని పరిష్కరించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిరంతర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈరోజు (సోమవారం) ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథి గృహంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ జరిగింది. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, అధికారులు పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి డిజైన్‌పై చర్చించారు.152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలనే తెలంగాణ ప్రతిపాదనపై చర్చించారు. 152 మీటర్ల ఎత్తులో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనం, ముంపును వివరాలతో సహా సీఎం రేవంత్‌రెడ్డి నివేదించారు. పరిహారం, పునరావాసంపై అధికారుల నివేదిక గురించి మహారాష్ట్ర సీఎంకు వివరించారు. 148 మీటర్ల ఒప్పందాన్ని పరిశీలించేందుకు సిద్ధమని ఫడ్నవీస్ తెలిపారు. మహారాష్ట్రకు నష్టం లేకపోతే తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపు అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు అవసరమని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ముంపు భూములకు మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలను వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై అధ్యయనానికి అధికారుల కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల అధికారుల అధ్యయనం తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఫడ్నవీస్‌ను రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.

## బొమ్మలు మాపించకండి.. చరిత్ర చెప్పండి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి : నేలకొండపల్లి గుర్తుకు వచ్చినప్పుడల్లా అభివృద్ధి కార్యక్రమాలంటూ హడావిడి చేయవద్దు. అందమైన కలర్ ప్రింట్లు తీసి కాగితాలలో ప్రణాళికలు చేయకుండా, చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలని, పూర్తిస్థాయి చరిత్రను అందుబాటులోకి తెచ్చి, ఈ ప్రాంతానికి ఉన్న ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెచ్చి రాజీ లేని అభివృద్ధి ప్రణాళికలు చేస్తే ఎక్కడి నుంచైనా నిధులు తెచ్చి ఇస్తానని హామీ ఇచ్చారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. నేలకొండపల్లి పర్యటనలో భాగంగా ఆయన బౌద్ధ స్థూప అభివృద్ధి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సాంస్కృతిక, చారిత్రిక బౌద్ధ స్థూప పరిసరాలను అడుగడుగునా కలియతిరిగారు.క్షేత్ర ఆవరణలో త్రవ్వకాలు చేస్తున్న బౌద్ధ భిక్షువుల ఆరామాలను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, పురావస్తు, తెలంగాణా హెరిటేజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాక సుమారు గంటన్నర పాటు బౌద్ధ క్షేత్రం యొక్క ప్రాధాన్యతను తెలుసుకునే ప్రయత్నం చేశారు. పురావస్తు శాఖాధికారులు చెప్పిన వివరాలతో సంతృప్తి చెందని అమాత్యులు స్థానికంగా కొంతమంది వ్యక్తులతో మాట్లాడి పూర్వపు విషయాలను తెలుసుకున్నారు. ఇంకా దేశ వ్యాప్తంగా ఉన్న చరిత్రకారులను, బౌద్ధం సంబంధిత అంశాలలో పట్టున్న వ్యక్తులను పిలిపించి సమగ్ర పరిశోధన చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఢిల్లీలోని ఓ కీలక చరిత్రకారునితోను అప్పటికప్పుడే ఫోన్ లోను మాట్లాడిన మంత్రి నేలకొండపల్లికి ఆహ్వానించారు. రానున్న పక్షం రోజులలో సమయం వ్యర్థం చేయకుండా పక్కా రోడ్ మ్యాప్ తయారు చేసేలా అధికారులకు, జిల్లా కలెక్టర్ కు పనిచేయాలని సూచించారు.

అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం..



నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉన్న 2, 3 వ శతాబ్దం నాటి బౌద్ధ స్తూపాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధులను ఆకర్షించేలా అభివృద్ధి చేస్తాం.. గతంలో ప్రభుత్వాలు, పాలకులు అభివృద్ధి ప్రణాళికలు ప్రణాళికలు వేసినా మధ్యలోనే నిలిచిపోయాయి. పురావస్తు, తెలంగాణా చారిత్రక, సాంస్కృతిక శాఖతోనూ సంప్రదింపులు జరిపి పూర్తి చరిత్రను వెలుగులోకి తెస్తాం. నిపుణులు, చరిత్రకారులతో పాటు బౌద్ధ ప్రముఖులతో కూడా సలహాలు సూచనలు తీసుకుని ఒక అంతర్జాతీయ బౌద్ధ కేంద్రంగా నేలకొండపల్లి ని ఉంచేందుకు ఎంత నిధులైనా ఖర్చు పెడతానని హామీ ఇస్తున్నాని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెరిటేజ్ శాఖ డైరెక్టర్ కుతాడి అర్జున్ రావు, హెరిటేజ్ శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తహశీల్దార్ రాంప్రసాద్, కన్సల్టెంట్ శ్రీనివాస్, టూరిజం డీఈ రామకృష్ణ, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..



రాజన్న సిరిసిల్ల : రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాసేవ చేసే నాయకులను గుర్తించి పదవులు కల్పించామని తెలిపారు. పదవులు పొందిన వారు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రైతుల పాదాలకు ముల్లు గుచ్చుకుంటే, దానిని వంటితో తీసినంత బాధ్యతతో ప్రజాప్రతినిధులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా ఏడు రకాల సన్న వడ్లను సాగు చేసిన రైతులకు నేడు మంచి ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. గతంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రూ.2 లక్షలలోపు పంట రుణాలు తీసుకున్న 25 వేల కుటుంబాలకు రూ.20,600 కోట్ల మేర రుణమాఫీ చేసినట్లు వివరించారు. రైతులకు తిరిగి రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని, పదేళ్లలో పంపిణీ చేయని రేషన్ కార్డులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందించామని పేర్కొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు..

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అర్హులైన నిరుపేదలకు మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను సుమారు రూ.1,000 కోట్లతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కోనరావుపేట మండలంలో సుమారు 1,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేశామని వివరించారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన పనులను తిరిగి ప్రారంభించి అభివృద్ధికి బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు.

## తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు షాకిచ్చిన బీజేపీ నేతలు!




హైదరాబాద్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింట్లో ఒక సీటును కచ్చితంగా గెలవాలని గట్టి ప్రయత్నం మీదున్న బీజేపీకి.. జనసేనతో పొత్తు అంశం పంటికింద రాయిలా మారింది. ఎన్డీయేలో భాగంగా ఉన్న జనసేన పార్టీతో పొత్తులు, పవన్‌తో ఎన్నికల ప్రచారాలకు సంబంధించి ఓ వ్యూహంతో ముందుకు పోవాలని తెలంగాణ బీజేపీ భావించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే పనిగట్టుకుని మరీ 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ' అని పేరుతో పవన్ రచ్చ రచ్చ చేశారని అనుకుంటున్నారు. ఇది చాలదంటూ మమ్మల్ని అడుగు పెట్టనీయరా...? ఎవడబ్బ జాగీరు తెలంగాణ..? అని రెచ్చగొట్టే కామెంట్ చేసి మళ్లీ ఇక్కడ తెలంగాణవాదాన్ని తట్టిలేపారు పవన్.

పవన్‌తో ప్రత్యేకంగా భేటీ..

ఈ నేపథ్యంలో బీజేపీ అధిష్టానం వేసుకున్న ప్రణాళికలకు తూట్లు పడినట్టయ్యిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని మోడీ హైదరాబాద్ వచ్చినప్పుడు పవన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ ఎన్నికల్లో పవన్ పట్ల ఇక్కడ యువతలో ఉన్న అభిమానాన్ని పార్టీ ఎదుగుదలకు, అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగించుకోవాలనే ప్లానింగ్ చేశారు. కానీ పవన్ తన వీరావేశంతో అంతా చెడగొట్టి కూర్చున్నారనే కామెంట్స్ తెలంగాణ బీజేపీ నుంచి వినిపిస్తున్నది. అందుకే ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనతో పొత్తుగానీ, మిత్రధర్మాన్ని అనుసరించి.. కనీసం ప్రచారం చేయించుకునే అంశాన్ని గానీ పరిగణలోకి తీసుకోవద్దని సూచించినట్టు తెలుస్తోంది.

బీజేపీని చెడగొట్టే వ్యవహారం..

తాజాగా తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇంచార్జి సునీల్ బన్సల్‌తో జరిగిన తెలంగాణ నేతల భేటీలో ఈ విషయం కీలకంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. మెజారిటీ నేతలంతా పవన్‌తో పొత్తు, ప్రచారం అంతా బీజేపీని చెడగొట్టే వ్యవహారమే తప్ప మరోటి కాదని తేల్చేశారట. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఆ పార్టీ చీఫ్ రాంచంద్రరావు పోటీ చేసే అవకాశం కనిపిస్తున్నది. నల్లగొండ- వరంగల్- ఖమ్మం నియోజకర్గం నుంచి ఇంకా పేరు ఖరారు కాలేదు. కానీ గ్రేటర్ ఎమ్మెల్సీపైనే బన్సల్ ప్రధానంగా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన నుంచి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నుంచి గడల శ్రీనివాసరావును బరిలోకి దింపారు పవన్. తెలంగాణకు మేమే ఆల్టర్నేట్ అనే ధీమాతో ఉన్న బీజేపీకి.. పవన్‌ను చేరదీయడమంటే చంకలో పిల్లిని పెట్టుకుని ప్రయాణం చేసినట్టేనని ఇక్కడి బీజేపీ నేతలు భావిస్తున్నారు.



## సంపాదకీయం

మంగళవారం 27-10-2026

# జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి. ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

# తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్?




హైదరాబాద్,రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యంగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ(టీజీ జెన్‌కో) థర్మల్ విద్యుదుత్పత్తిని గణనీయంగా మెరుగుపరుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ రంగంపై నిర్వహిస్తున్న సమీక్షలు, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు నిరంతర పర్యవేక్షణతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు వేగవంతమయ్యాయి.

అక్టోబర్ 20న..

ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ఐదో యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం కావడం కీలక ముందడుగుగా నిలిచింది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల ఐదో యూనిట్‌ను అక్టోబర్ 20న విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానించారు. ప్రారంభ బొగ్గు దహన పరీక్షల్లో ఈ యూనిట్ 158.7 మెగావాట్ల గరిష్ఠ లోడ్‌ను సాధించింది. తదుపరి సన్నాహక పనుల కోసం యూనిట్‌ను తాత్కాలికంగా ట్రిప్ చేశారు. అన్ని ప్రక్రియలు పూర్తయితే నవంబర్ లో వాణిజ్య కార్యకలాపాల తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ యూనిట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే యాదాద్రి కేంద్రం మొత్తం 4,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో పనిచేయనుంది.

రోజుకు 1,800 నుంచి 2,300 మెగావాట్ల సరఫరా..

ఇప్పటికే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించిన యాదాద్రి నాలుగు యూనిట్లు రాష్ట్ర గ్రిడ్‌కు రోజువారీ అవసరాలకు అనుగుణంగా 1,800 నుంచి 2,300 మెగావాట్ల విద్యుత్‌ను అందిస్తున్నాయి. బాయిలర్, టర్బైన్, నీటి సరఫరా, బూడిద నిర్వహణ వ్యవస్థలు సంతృప్తికరంగా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఐదో యూనిట్ అందుబాటులోకి వస్తే రాష్ట్ర విద్యుత్ వ్యవస్థకు మరింత బలమైన ఆధారం లభించనుంది. థర్మల్ కేంద్రాల్లో నిరంతర ఉత్పత్తిని కొనసాగించేందుకు టీజీ జెన్‌కో బొగ్గు సరఫరాను విస్తరిస్తోంది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నుంచి లభించే బొగ్గుతో పాటు నైనీ బొగ్గు బ్లాక్, మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ నుంచి సరఫరాలను సమీకరిస్తోంది. నైనీ బ్లాక్ నుంచి రోజుకు నాలుగు నుంచి ఐదు రేకుల బొగ్గు యాదాద్రికి చేరుతోంది. శక్తి పాలసీ 2025లోని విండో ×× కింద ఎంసీఎల్ నుంచి కొనుగోలు చేసిన బొగ్గును తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

నెలాఖరుకు కోల్ హ్యాండ్లింగ్ పనులు పూర్తి..

వర్షాకాలంలో తడిసిన బొగ్గు కారణంగా ఎదురయ్యే సమస్యలను అధిగమించడంతో పాటు బొగ్గు నిర్వహణ వ్యవస్థ(సీహెచ్‌పీ) సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సహకారంతో చేపట్టిన మరమ్మతులు, ఆధునికీకరణ పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు పూర్తయితే గంటకు 2,500 టన్నుల బొగ్గును నిర్వహించడంతో పాటు రోజుకు 12 నుంచి 14 బొగ్గు రేకులను అన్‌లోడ్ చేసే సామర్థ్యం అందుబాటులోకి రానుంది. యాదాద్రి ప్రాజెక్టు పురోగతిని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీ జెన్‌కో సీఎండీ హరీశ్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో జాప్యం లేకుండా రోజుకు రెండుసార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీజీ జెన్‌కో, బీహెచ్ఈఎల్, నిర్మాణ సంస్థల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంతో..

ప్రధాన కార్యాలయం, ఇతర విద్యుదుత్పత్తి కేంద్రాల నుంచి ఇంజినీరింగ్ సిబ్బందిని యాదాద్రికి తరలించి పనులను వేగవంతం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న గృహ, పారిశ్రామిక విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని థర్మల్ కేంద్రాల నుంచి రోజుకు కనీసం 140 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని టీజీ జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంది. యాదాద్రి ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తిలోకి రావడం, బొగ్గు సరఫరా మెరుగుపడటం, కోల్ హ్యాండ్లింగ్ వ్యవస్థ పటిష్ఠం కావడం ద్వారా రాష్ట్ర విద్యుత్ సరఫరాకు మరింత స్థిరత్వం చేకూరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణను విద్యుత్ మిగులు రాష్ట్రంగా, ఇంధన భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..దీపావళికి ముహూర్తం

హైదరాబాద్,రాష్ట్రంలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమవుతున్నదని సచివాలయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. దీపావళి నాటికి కీలక శాఖల అధిపతులు (హెచ్ వోడీలు), రెండేండ్లకుపైగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న కలెక్టర్లను మార్చే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. కేవలం సర్వీస్ కాలాన్ని ప్రాతిపదికగా తీసుకోకుండా, అధికారుల పనితీరు, అభియోగాలు, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు, పెండింగ్ ఫైళ్లు, ప్రజా సమస్యల పరిష్కారం, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. ఇప్పటికే అధికారుల నుంచి స్వీయ పనితీరు నివేదికలు, వివిధ శాఖల పనితీరుపై అంతర్గత నివేదికలు తెప్పించినట్టు తెలిసింది. వీటి ఆధారంగానే బదిలీలు జరుగుతాయని చెప్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొంతమంది జిల్లా కలెక్టర్ల పనితీరు, హెచ్‌వోడీల మీద తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సీఎంవో నుంచి లీకులు వదులుతున్నారు.

పనితీరుపై సీఎం అసహనం

పరిపాలనలో ఆశించిన వేగం కనిపించకపోవడం, కీలక నిర్ణయాలు పెండింగ్‌లో ఉండటం, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో పర్యవేక్షణ లోపించడం తదితర అంశాల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులపై అసహనం వ్యక్తంచేసినట్టు తెలుస్తున్నది. ఈ నెలలో విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా అంశంపై అధికారులకు సీఎం తీవ్ర హెచ్చరికలు చేసినట్టు తెలిసింది. యాదాద్రి సహా థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లో పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేలా చూడాలన్న ఆదేశాల అమల్లో అధికారుల నిర్లక్ష్యాన్ని సీఎం తీవ్రంగా పరిగణించినట్టు సమాచారం. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్, జెన్‌కో సీఎండీ ఎస్ హరీశ్‌కు హెచ్చరికలు చేసినట్టు వార్తలు వచ్చాయి. అధికారుల పనితీరులో నిర్లక్ష్యం కొనసాగితే సస్పెన్షన్లకూ వెనుకాడబోనని సీఎం హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతున్నది. అధికారుల పనితీరుపై కేవలం మౌఖిక అభిప్రాయాలకే పరిమితం కాకుండా, వారి స్వీయ అంచనాలు, శాఖల పురోగతిపై నివేదికలు, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో చూపిన చొరవ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్టు చెప్తున్నారు. ప్రధాన కార్యదర్శి స్థాయిలో అధికారుల పనితీరు వివరాలు సేకరించి, ముఖ్యమంత్రి కార్యాలయానికి అందుబాటులో ఉన్న నివేదికలతో సరిపోల్చుతున్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

రెండేండ్లు దాటిన కలెక్టర్లపై దృష్టి

ఈసారి భారీగా జిల్లా కలెక్టర్ల బదిలీలు ఉంటాయని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు మంత్రుల మాట మినహా తమ మాట వినడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఒక జిల్లా కలెక్టర్ స్థానిక మంత్రినైనా తనను కూడా లెక్కచేయడం లేదని ఒక మంత్రి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్టు చెప్తున్నారు. బదిలీల్లో సదరు కలెక్టర్‌ను ఇక్కడి నుంచి పంపించాలని సదరు మంత్రి పట్టుపడుతున్నట్టు తెలిసింది. సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట కలెక్టర్లను బదిలీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. ఒకే జిల్లాలో రెండేండ్లకుపైగా పనిచేస్తున్న కలెక్టర్ల మార్పు ఈ




కసరత్తులో ప్రధాన అంశంగా కనిపిస్తున్నది. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, జగిత్యాల కలెక్టర్ బీ సత్యప్రసాద్, కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, రంగారెడ్డి కలెక్టర్ సీ నారాయణరెడ్డి రెండేండ్లపాటు అక్కడే కొనసాగిన నేపథ్యంలో వారిని బదిలీ చేసే అవకాశం ఉన్నట్టు చెప్తున్నారు.

హెచ్‌వోడీల మార్పులపై కసరత్తు

జిల్లా కలెక్టర్లతోపాటు కీలక శాఖల్లో పూర్తిస్థాయి అధిపతుల నియామకంపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్టు తెలుస్తున్నది. పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యం వంటి శాఖలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులపై పనిభారం తగ్గించడం, ఖాళీలను భర్తీ చేయడం, శాఖల మధ్య సమన్వయం పెంచడం లక్ష్యంగా మార్పులు ఉండవచ్చని సమాచారం. ప్రస్తుతం ఒకటి కంటే ఎకువ శాఖల బాధ్యతలు చూస్తున్న ఉన్నతాధికారులకు బదులుగా పూర్తిస్థాయి కార్యదర్శులను నియమించే అంశాన్ని కూడా పరిశీలించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. కీలక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిశ్రమల అనుమతులు, సంక్షేమ పథకాల అమలు వేగవంతం కావాలంటే సంబంధిత శాఖల్లో నిర్ణయాధికారం స్పష్టంగా ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నదని అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది.నిషేధిత ఆస్తుల జాబితా (22-ఏ) నిర్వహణ, ప్రభుత్వ భూముల రక్షణ అంశాలు కూడా అధికారుల పనితీరు సమీక్షలో ప్రాధాన్యత పొందవచ్చని తెలుస్తున్నది. 22-ఏ భూముల వ్యవహారంలో పర్యవేక్షణ తీరుపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసంతృప్తిగా ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో సీసీఎల్‌ఏలో భారీ మార్పులు జరుగుతాయని ప్రచారం జరుగుతున్నది. ప్రభుత్వ శాఖల్లో నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం, కోర్టు ఆదేశాల అమల్లో నిర్లక్ష్యం కూడా ఉన్నతాధికారుల పనితీరుపై చర్చకు కారణమవుతున్నదని తెలుసున్నది. భూసేకరణ పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌పై హైకోర్టు గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం చెల్లింపులు జరిగినట్టు గుర్తించి ఆ ధికరణ విచారణను ముగించింది. తాజా బదిలీల్లో వీళ్లందరికీ బదిలీలు తప్పవని చెప్తున్నారు.

# పుష్కర పనులను వేగవంతం చేయాలి

జయశంకర్ భూపాలపల్లి,గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన కమిషనర్ దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేవట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు.వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ నామినేషన్లు

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న జగన్ నాటకాలను అధికారిక లెక్కలే బట్టబయలు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీలో ఉన్నారో, కొన్నిచోట్ల కూటమి కంటే ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేసి హోరాహోరీగా రేసులో నిలిచారో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకంగా 12,419 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ తరఫున 15,017 మంది నామినేషన్లు సమర్పించారు. జనసేన నుంచి 2,073, బీజేపీ నుంచి 562 నామినేషన్లు వచ్చాయి. ఇక జెడ్పీటీసీల విషయానికొస్తే.. 659 స్థానాలకు మొత్తం 2,805 నామినేషన్లు పడగా, వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 1,092 మంది పోటీలో నిలిచారు. అధికార టీడీపీ తరఫున 1,055 మంది మాత్రమే నామినేషన్లు వేయగా, జనసేన నుంచి 178, బీజేపీ నుంచి 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన స్థానాల్లో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ నేతలే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడం వారి ఫేక్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది.తమ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అక్రమాలను, దౌర్జన్యాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు అధికార కూటమిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ బలవంతపు ఏకగ్రీవాలతో రికార్డు సృష్టించింది. నాడు పట్టణ ప్రాంతాల్లో 20.72 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం ఎంపీటీసీలు, 19 శాతం జెడ్పీటీసీలను ప్రతిపక్షాలను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి బలవంతంగా చేజిక్కించుకున్నారు. నాడు జరిగిన విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి సాధించిన ఏకగ్రీవాలనే తమ గొప్ప విజయాలుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసుకుంది.కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్లే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కావడం సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కెమెరాల ముందు నాటకాలు ఆడుతూ, ఫేక్ వీడియోలతో నేషనల్ మీడియాను, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనేది ఈ అధికారిక గణాంకాలతో స్పష్టంగా నిరూపణైంది. ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ వర్గం ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్ముకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అవినీతి అధికారులకు సెక్రటేరియట్ లో లాబీయింగ్

హైదరాబాద్, తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారుల

# ఎన్నికల వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యమైన రాజకీయ, చట్టపరమైన సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక పోరులో నామినేషన్ల ఘట్టం నుంచి మొదలైన వివాదం ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం వరకు చేరినప్పటికీ.. అధికార కూటమి, పొలిటికల్ సర్కిళ్లలో మరో ఆసక్తికరమైన ప్రచారం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నామినేషన్లను అడ్డుకున్నారు అనే ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగానే తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బహిష్కరణ ప్రకటన వచ్చేలా మానసిక వాతావరణాన్ని సిద్ధం చేసుకుంటోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు సమస్యాత్మక కేంద్రాలు, మున్సిపాలిటీలలో స్థానిక అధికారులు , పోలీసులు తీసుకుంటున్న భద్రతా చర్యలే. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, అనవసర ఘర్షణలను నివారించేందుకు పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, సంబంధిత అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అయితే, వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు తమ అనుచరగణంతో భారీ రాలీలుగా నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ, దీన్నే పక్కాగా తమకు అనుకూలంగా మలుచుకుని మా నేతలను పోలీసులు దగ్గరుండి అడ్డుకుంటున్నారు, నామినేషన్లు వేయనివ్వడం లేదు అని వైసీపీ డిజిటల్ స్పేస్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తోందనేది టీడీపీ నేతల ఆరోపణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి యంత్రాంగం , ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రమైన నైరాశ్యంలో కూరుకుపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి ఉనికి కూడా తుడిచిపెట్టుకుపోతుందనే భయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పోటీ చేసి ఓడిపోవడం కంటే.. ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాం అనే నరేటివ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పార్టీ ప్రతిష్టకు క్షేమకరమని వైసీపీ అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను వీలైనంత వివాదాస్పదం చేయడం ద్వారా తమ బహిష్కరణ నిర్ణయానికి పునాది వేసుకునే ప్రయత్నం సాగుతోందని తెలుస్తోంది. నామినేషన్లలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించడం, ఆరోపణలను మీడియా వేదికగా నిరంతరం పబ్లిసిటీ చేయడం ద్వారా.. ఎన్నికల యంత్రాంగం , పోలీసులు కూటమికి కొమ్ముకాస్తున్నారు, ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు ప్రహసనంగా మారాయి అనే అభిప్రాయాన్ని బలంగా నాటాలని యత్నిస్తున్నారు. మా అభ్యర్థుల ప్రాణాలకు రక్షణ లేదు, అందుకే మేము ఈ ప్రజాస్వామ్య రహిత ఎన్నికలను బహిష్కరిస్తున్నాం అని బాహాటంగా ప్రకటించడానికి పార్టీకి ఒక బలమైన సాకు దొరుకుతుందని భావిస్తున్నారు. తమకు ప్రజా మద్దతు ఉందని, కానీ అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం వల్లే తాము న్యాయపోరాటం చేయాల్సి వస్తోందని వారు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా నామినేషన్ల ప్రక్రియను సమీక్షించి గడువు పెంపును పరిశీలించాలని సూచించడమే తమ ఆరోపణలకు నిదర్శనమని వారు స్పష్టం చేస్తున్నారు. స్థానిక పోరులో సాగుతున్న ఈ యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ , పోలీసులు ఎంతటి పటిష్ట భద్రత కల్పించినా, ఒకవేళ వైసీపీ నిజంగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తే.. అది రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రగడకు దారితీస్తుంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ వ్యూహం బహిష్కరణ వైపా లేక పూర్తిస్థాయి పోరాటం వైపా అనేది తేలిపోనుంది.

### పదవీకాలం ముగిసిన మార్కెట్ కమిటీలకి నూతన పాలకవర్గాలు నియామిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

హైదరాబాద్:పదవీకాలం ముగిసిన నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్, సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మరియు ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎంఏ)లకి నూతన పాలకవర్గాలను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, నూతన పాలకవర్గానికి రెండేళ్ల పదవీకాలం ఉండనుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతెలియజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్, సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మరియు ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్కెట్ కమిటీల తొలి పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగిసింది. పదవీకాలం ముగిసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా నూతన పాలకవర్గాన్ని నియమించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మార్కెట్ కమిటీకి చైర్మన్ గా పసుపుల షమీమ్, వైస్ చైర్మన్ గా పసుపుల నరసింహ మరియు సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మార్కెట్ కమిటీకి చైర్మన్ గా మాతంగి శిరీష, వైస్ చైర్మన్ గా పర్న సంతోష్, ఇల్లంతకుంట, రాజన్న సిరిసిల్ల జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గా అంతగిరి సాహిత్య, వైస్ చైర్మన్ గా గాన్రెడ్డి భరత్ రెడ్డి గార్లని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఎంపికైన నూతన పాలకవర్గం స్థానిక రైతుల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తూకం, నిల్వ, వేలం ప్రక్రియలలో పారదర్శకతను మరింత బలోపేతం చేస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు మంత్రి అభినందనలు తెలియజేస్తూ, రైతులకు అంకితభావంతో సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## టూ టైర్ సిటీస్ లోకి క్విక్ కామర్స్

కర్నూలు,ఇ-కామర్స్ సేవలు వేగంగా విస్తరిస్తుండటం, క్విక్ కామర్స్ సంస్థల మధ్య పోటీ పెరగడంతో ప్రముఖ లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ దిగ్గజాలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. కేవలం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల సరిహద్దుల్లో భారీగా భూములను సమీకరించే పనిలో పడ్డాయి. జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న వ్యూహాత్మక ప్రాంతాల్లో వందలాది ఎకరాలను సుదీర్ఘ కాలానికి లీజుకు తీసుకోవడం లేదా డెవలప్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకోవడం గత వారంలో గణనీయంగా పెరిగింది.ఈ నూతన ధోరణిలో ప్రధానంగా జాతీయ రహదారుల జంక్షన్లు, ఇండస్ట్రియల్ కారిడార్లు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు వంటి ప్రధాన పట్టణాల బైపాస్ రోడ్లకు సమీపంలో ఉన్న ల్యాండ్ పార్సెల్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. పక్కా రవాణా సదుపాయాలు, తక్కువ ధరకే లభించే భూమి, చౌకగా లభించే స్థానిక కార్మికులు ఈ నగరాల వైపు గ్లోబల్ లాజిస్టిక్స్ సంస్థలను ఆకర్షించడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.టైర్-2, టైర్-3 ప్రాంతాల్లో నివసించే వినియోగదారులకు కూడా సేమ్ డే డెలివరీ, దా కొన్ని గంటల వ్యవధిలోనే సరుకులను అందజేయాలనే లక్ష్యంతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

# ఒక్క వార్నింగ్ తో నేతల తిప్పలు

తిరుపతి, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ చేసిన వ్యూహాత్మక తప్పిదమే ఇప్పుడు ఈ ఘర్షణలకు కారణమవుతున్నాయి. ఆయన పోటీ చేయాలని ఒక్క పిలుపు ఇచ్చి ఊరుకుంటే సరిపోయేది. ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు కూడా దక్కవని ఇచ్చిన వార్నింగ్ తోనే కూటమి నేతలు అప్రమత్తమయ్యారని వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ నాయకులను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు మరియు ప్రస్తుత రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీశాయి. జగన్ వ్యూహం తప్పుగా మారిందా లేదా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో భిన్నమైన విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మౌనంగా ఉండి పోటీ చేయాలని మాత్రమే చెప్పి ఉంటే ఇంతటి ఉద్రిక్తతలు నెలకొని ఉండేవి కావన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు జరిగిన పార్టీ సమావేశాలలో జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు మరియు నేతలకు "స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు జరగడానికి వీల్లేదు" అని కఠినమైన వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ ఏదైనా స్థానంలో పోటీ పెట్టకుండా కూటమి అభ్యర్థుల ఏకగ్రీవానికి సహకరిస్తే, ఆ ఇన్‌చార్జ్‌లకు భవిష్యత్తులో ఎమ్మెల్యే సీట్లు కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు మరియు ప్రతి సీటులోనూ పోటీ గట్టిగా ఉండాలనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నియోజకవర్గాల ఇన్ ఛార్జులు తెగించి మరీ బరిలోకి దిగారు. దీంతో దాడులు – ప్రతి దాడులుజరిగాయి. అదే సమయంలో కూటమి నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అసలు నామినేషన్లు వేయకుండా అడ్డుకుని అధికారంలో తాము ఉన్నామని జగన్ కు గుర్తు చేసినట్లయింది. ఇది సాధారణ ఎన్నికలు కావన్నది జగన్ విస్మరించారు. జగన్ హెచ్చరికల అనంతరం పులివెందుల, పుంగనూరు, రాయచోటి, మైదుకూరు వంటి వైసీపీకి బలమైన కోటలుగా ఉన్న ప్రాంతాలలో సైతం పలు మున్సిపాలిటీలు, వార్డులు కూటమి పరమవబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనికి విశ్లేషకులు చెప్తున్న ప్రధాన కారణాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల ఖర్చంతా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరియు అభ్యర్థులే భరించాలని, పార్టీ నుండి ఎలాంటి ప్రత్యేక ఆర్థిక సహాయం ఉండదని జగన్ ముందే తేల్చిచెప్పడం వల్ల చాలామంది కొంత నిరాశలో పడ్డారు. తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా కూటమి ప్రభుత్వం, పోలీసులు అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చింపేస్తూ అరాచకాలకు పాల్పడ్డారని జగన్ స్వయంగా ఆరోపించారు. దీనిపై ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మరియు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.నామినేషన్ల ప్రక్రియలో జరిగిన గొడవలు మరియు అభ్యర్థులను అడ్డుకున్న అంశాలపై వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అయితే ఇంతకీ జగన్ సాధించిందేందన్న ప్రశ్న మాత్రం నేతల్లో వ్యక్తమవుతుంది

మారని నేతల తీరు

పరిషత్ ఎన్నికల్లో తీరు మారలేదు. హింసాత్మక ఘటనలు జరిగాయి. అనేక చోట్ల నామినేషన్ల పత్రాలను ప్రత్యర్థుల నుంచి తీసుకుని చించేశారు. పోలీసులు చేతులెత్తేశారు. ఇలాంటి ఘటనలు కూడా ఎక్కువ రాయలసీమలోనే జరిగాయి. కడప జిల్లాలో నిన్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా



వేయలేక పోయింది. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జడ్పీ ఎన్నికల్లోనూ అదే తీరు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. టీడీపీ, వైసీపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అపహాస్యానికి లోనయిందనే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలకు టీడీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. వైసీపీ నేతలే దాడులకు తమపైకి దిగుతూ ఎదురుదాడికి దిగుతున్నారని అంటున్నారు కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం లేదా బలవంతపు ఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటాయి.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగాలని మరియు హింసకు తావులేకుండా చూడాలని ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. పోలీసులు అభ్యర్థులకు భద్రత కల్పించాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. కడప, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు మరోసారి ప్రజలను నివ్వెర పర్చేలా చేశాయి. ఆంధ్రప్రదేశ్ లో రెండు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకి దిగుతుండటంతో పోలీసులు కూడా అదుపు చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత కూడా ఇబ్బందిగా మారిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ నిన్న ప్రారంభమయినా పలుచోట్ల ఉద్రిక్తతలు, ఘర్షణల మధ్య హింసాత్మకంగా ప్రారంభమైంది. అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య పలు జిల్లాల్లో తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో హింస జరుగుతోందంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిన్న కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైతే నామినేషన్ల గడువును 48 గంటల పాటు పొడిగించేలా నిర్ణయం తీసుకోవాలని ఏపీ ఎన్నికల సంఘానికి సూచించింది. అభ్యర్థులు నేరుగా జిల్లా కలెక్టర్ల వద్ద కూడా నామినేషన్లు సమర్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది.ఈ గొడవల నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితా విడుదలను కోర్టు అక్టోబర్ 25 వరకు పొడిగించింది.

# ఏది అనుమానాస్పదం?



న్యూఢిల్లీ,పదిహేను మాసాల క్రితం అనుమానాస్పద పరిస్థితుల్లో ఉపరాష్ట్రపతి పదవి నుండి హఠాత్తుగా ఆరోగ్య కారణాల సాకుతో వైదొలిగిన జగదీప్ ధన్ఖడ్ ఆర్ఎస్ఎస్ దసరా ఉత్సవాల సందర్భంగా వారి వేదిక మీద కనిపించడం పెద్ద ఎత్తున చర్చకు అవకాశం కల్పించింది. ఓ పక్క బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ధన్ఖడ్ కు ఢిల్లీలో మాజీ ఉప రాష్ట్రపతి హోదాలో గృహవసతి కూడా కల్పించకుండా ఆయనని అవస్త పెడుతున్నదన్న వాదన వినబడుతుంటే బీజేపీ సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్ దసరా ఉత్సవాలకు ఆహ్వానిస్తే చర్చ జరగకుండా ఎందుకు ఉంటుంది?.అవి మామూలు దసరా ఉత్సవాలు కాదు, ఏటేటా దసరా పండగనాడు ఆర్ఎస్ఎస్ కేంద్ర స్థానమయిన నాగపూ ర్‌లో ఆ సంస్థ స్థాపక దినోత్సవం కూడా జరుగుతుంది, ఈ ఏడాది దసరానాడు మరింత ప్రాధాన్యత లభించడానికి కారణం ఆర్ఎస్ఎస్ శత జయంతి సంవత్సరపు వేడుకల ముగింపు కూడా దీనికి తోడుకావడం. ఈ దసరా నాడు నాగపుర్ లోని రేశిం బాఘ్ మైదానంలో జరిగిన ఇంత ప్రాముఖ్యత గల ఈ ఉత్సవాలకు జగదీప్ ధన్ఖడ్ ను ఆర్ఎస్ఎస్ పెద్దలు ఎందుకు విశేష అతిథిగా ఆహ్వానించినట్టు ? ఈ వేడుకల్లో నాగపుర్ కు అత్యంత ఇష్టులయిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో పాటు ముఖ్య అతిథిగా దయినిక్ జాగరణ్ దిన పత్రిక సంపాదకులు సంజయ్ గుప్తా, ఇజ్రాయెల్ కాన్సులర్ జనరల్ యానివ్ రీవాచ్, సరసన ఆర్ఎస్ఎస్ మహానేత మోహన్ భాగవత్ తో కలిసి వేదికను పంచుకున్నారు ధన్ఖడ్.అసలు కోరి పిలిపించుకుని ఉపరాష్ట్రపతిగా నియమించుకున్న ఒకప్పటి అత్యంత ఇష్టుడు జగదీప్ ధన్ఖడ్ ను మోడీ, అమిత్ షా ద్వయం ఎందుకు అంత అవమానించి బయటకు పంపించారు? ఆ ఇద్దరికి ఇష్టుడు అనడానికి ఆయన ఉప రాష్ట్రపతి కాక ముందు వెలగబెట్టిన వ్యవహారాలే కారణం . మామూలుగా ఉపరాష్ట్రపతి పదవికి ఎవరిని ఎంపిక చేస్తారు అంటే రెండు రకాల వారిని అని చెప్పుకోవచ్చు. అది రెండువేల ప ద్నాలుగు నుండి . అంతకు ముందు వచ్చిన ఉప రాష్ట్రపతులందరూ ఈ కోవ కు చెందిన వారేం కాదు . మహామేధావులు , గొప్ప నైతికత కలిగిన వారు కూడా ఉప రాష్ట్రపతులుగా పనిచేసిన వారిలో ఉన్నారు . ఉపరాష్ట్రపతి అంత ఆషామాషీ పదవేమీ కాదు .ఆ పదవిలో ఉన్నవారు రాజ్యసభ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు . రాజ్యసభ పెద్దల సభ కదా, పెద్దల సభను ఆదుపు చేసే , సరైన తోవలో నడిపించే బాధ్యత అన్నమాట . మోడీ, అమిత్ షాలు కేంద్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక ఇటువంటి పదవులకు రాజకీయంగా ఇక పై క్రియాశీలకంగా ఉంటే తమకు ఇబ్బందిగా తయారవుతారనుకున్న వారిని లేదా తమకు అత్యంత విధేయులుగా నడుచుకునే వారిని నియమించడం మొదలైంది. జగదీప్ ధన్ఖడ్ జనతాదళ్ , కాంగ్రెస్ పార్టీ ల మీదుగా బీజేపీలోకి వచ్చి చేరాక మోడీ రెండవసారి ప్రధానమంత్రి అయిన వెంటనే రెండువేల పందొమ్మిదిలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా నియమితుడైనాక తక్కువ విధేయతేమి ప్రదర్శించ లేదు . అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతోనూ అప్పటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తోనూ అనేక మార్లు ఘర్షణ లకు దిగారు . గవర్నర్ పదవిలో ఉంటూ పలుమార్లు ట్విట్టర్ ద్వారా, ప్రచార ప్రసార మాధ్యమాల ద్వారా రాజకీయ అంశాల మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వారు .పశ్చిమ బెంగాల్ అసలైన ప్రతిపక్ష నాయకుడు అని ఆయనను తృణమూల్ కాంగ్రెస్ ఎద్దేవా చేసే దశకు ఆయన రాజకీయ వ్యాఖ్యలు హద్దులు మీరాయి . అనైతికమైన , జుగుప్సాకరమైన పద్ధతుల్లో తన పేరును పలు సందర్భాలలో ఉచ్చరిస్తున్నారన్న కారణం చేత ధన్ఖడ్ ను మమతా బెనర్జీ ఎక్స్ లో బ్లాక్ కూడా చేశారు. ఒక ముఖ్య మంత్రి తన రాష్ట్ర గవర్నర్ నే బ్లాక్ చేసారంటే విభేధాలు ఏ స్థాయి కి పోయి ఉంటాయో అర్థం చేసుకోవొచ్చు .అంతటి విధేయుడైన ధన్ఖడ్ ను రెండువేల ఇరవై రెండులో ఉపరాష్ట్రపతి పదవికి పోటీలో నిలబెట్టినప్పుడు బీజేపీ ఆయనను కిసాన్ పుత్ర అని ఆకాశానికి ఎత్తేసింది . ఆయన నామినేషన్ దాఖలుకు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు పెద్ద ఊరేగింపుగా వెళ్లారు . మూడు సంవత్సరాలు గడవక ముందే ఎందుకు ఈ ముచ్చట ముగిసిపోయిందో మరి . ఆయన ఉపరాష్ట్రపతి పదవికి అనుమానాస్పద రీతిలో రాజీనామా చేశారు.వాళ్లు ఎందుకు పంపించారు ? ఆర్ఎస్ఎస్ ఎందుకు ఇంత విశిష్ట ఘట్టంలో ఆయనను మళ్లీ తన వేదిక మీదకు ఆహ్వానించింది ? కొంతకాలంగా బయట చర్చ జరుగుతున్నట్టు బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఆర్ఎస్ఎస్ కు పొసగడం లేదా? ఈ సమయంలో ధన్ఖడ్ ను ఆహ్వానించడం ఆర్ఎస్ఎస్ తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి చేసిన ప్రయత్నంగా సంఘ్ వర్గాలు భావిస్తున్నాయి. గత కొన్నిఏళ్ళుగా ఆర్ఎస్ఎస్ మీద బీజేపీదే పై చేయిగా మారిందన్న అపోహను ధన్ఖడ్ కు ఆహ్వానం పలకడంతో తొలగించినట్టు అయిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి .గత కొద్ది సంవత్సరాలు గా ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్యాపదేశంగానే అయినా చేస్తున్న కొన్ని ప్రకటనలు కేంద్రం లో అధికారం లో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి చురకలు అంటించే విధంగానే ఉంటూ వొచ్చాయి . గత సంవత్సరం దసరా వేడుకల సందర్భం గా మోహన్ భాగవత్ తన ప్రసంగం లో మణిపూర్ రాష్ట్రం లో మత కల్లోలాల పట్ల తన ఆందోళన వ్యక్తం చేసారు. ఒక సంవత్సర కాలం గడిచాక కూడా ఆ రాష్ట్రం శాంతి నెలకొనే పరిస్థితుల కోసం ఎదురు చూడాల్సి వొస్తున్నది అని ఆయన చేసిన వ్యాఖ్యానాన్ని కేంద్ర ప్రభుత్వం అక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకు సరయిన రీతిలో పని చెయ్యలేదన్న అర్థం స్ఫురించే విధంగా ఉంది . ఈ ప్రకటన తరువాతనే మోడీ మొదటి సారి మణిపూర్ లో పర్యటించారు.ఇంకో సందర్భంలో మోహన్ భగవత్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వైఖరిని ఎత్తి చూపుతున్నట్టు గా ప్రజాస్వామ్యం లో ప్రతిపక్షాన్ని ప్రతిపక్షంగానే చూడాలి తప్ప దేశద్రోహులుగా కాదు అంటారు . ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వయసు 75 ఏళ్ళకు సమీపిస్తున్న తరుణంలో ఆ వయసు రాగానే అందరూ పదవీ విరమణ చెయ్యాలన్నది ఆర్ ఎస్ ఎస్ నిబంధన అన్న మోహన్ భగవత్ తరువాత మళ్ళీ ఏ కారణం చేతనో అట్లా అనలేదని నవరించుకోవడానికి మధ్యన మోడీ ఒక సారి నాగపూర్ సందర్శించారనే వార్తలు కూడా వొచ్చాయి. ఆర్ ఎస్ ఎస్ అధినేత అనుసరించిన అటువంటి ధోరణి కొనసాగింపుగానే ధన్ఖడ్ ను ఆహ్వానించడం జరిగిందేమో.కేంద్రం లో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి ని చెయ్యడానికి ఏదయినా కుట్ర జరిగిందా ? ఆ కుట్ర ను అమెరికా నుండి కొన్ని విదేశీ శక్తులు అప్పటి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్ ద్వారా అమలు చేయ్యాలనుకున్నాయా? ఆ కుట్ర లో అనీల్ అంబాని అనే వ్యాపార వేత్త కూడా ఉన్నాడా?. ఇదంతా తెలిసినందుకే ధన్ఖడ్ చేత మోడీ అంత హడావుడిగా రాజీనామా చేయించారా? ధన్ఖడ్ రాజీనామా తరువాత ఇటువంటి కథ ఒకటి పెద్ద ఎత్తున ప్రచారం లోకి వొచ్చింది.అదే నిజం అయి ఉంటే ధన్ఖడ్ ను ఆర్ ఎస్ ఎస్ తన సభలకు విశిష్ట అతిథి గా ఎందుకు ఆహ్వానిస్తుంది ? మోడీ అంటే ఆర్ ఎస్ ఎస్ కు గిట్టడం లేదనే అనుకుందాం.

# లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు

కర్నూలు ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘ

# పవన్ వ్యూహాత్మక మౌనమేనా... నితీష్ మీద కాంగ్రెస్ సాఫ్ట్ కార్నర్...బీజేపీ మీద నిప్పులు !



తిరుపతి, హింసాత్మక సంఘటనలపై ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించకపోవడం నష్టంగానే చూడాలి. నేరుగా బహిరంగంగా తీవ్రస్థాయి లో స్పందించకపోవడంపై రాజకీయ వర్గాల్లో విభిన్న విశ్లేషణలు సాగుతున్నాయి. ఈ మౌనం ఆయనకు రాజకీయంగా నష్టమా లేదా అనేది విశ్లేషకులు మరియు ప్రత్యర్థుల కోణాల్లో భిన్నంగా ఉంది. అయితే, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేస్తూ, వైసీపీ హింసను ప్రేరేపిస్తోందని అధికారికంగా ఆరోపించారు. కానీ జరుగుతున్న పరిణామాలపై ఆయన నేరుగా స్పందించలేదు. ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించే జనసేనాని ఇంత జరుగుతున్నా స్పందించకపోవడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతుంది. భవిష్యత్ లో ఏదైనా జరిగినా పవన్ కల్యాణ్ స్పందించినా ఆయన మాటలకు విలువ ఉండకపోవచ్చన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.పవన్ కల్యాణ్ కు ఇతర ఏ పార్టీల రాజకీయ పార్టీల అధినేతలకు లేని క్లీన్ ఇమేజ్ ఉంది. అది ఆయన సొంతం. నిజాయితీగా రాజకీయం చేస్తారని నమ్ముతారు. అలాగే ప్రశ్నించడం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే పవన్ కల్యాణ్ ఈ ఘటనలపై కనీసం స్పందించకపోవడాన్ని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా తప్పుపడుతున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉండకపోవడంతో స్పందించడం లేదని సర్ది చెప్పుకోవచ్చు. కానీ సామాన్యులలో మాత్రం జరుగుతున్న ఘటనల్లో పవన్ కల్యాణ్ కు కొంత షేరింగ్ తగులుకుంటుందేమోనన్న ఆందోళన జనసైనికుల్లోనూ, పవన్ అభిమానుల్లోనూ వ్యక్తమవుతుంది. వారి ఆందోళనలకు కారణమదే. జనసైనికులు నేరుగా తమ ఆందోళనలను, అసమ్మతిని సోషల్ మీడియాలో చెబుతున్నా పవన్ కల్యాణ్ కనీసం పట్టించుకోకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ శాంతి భద్రతల సమస్యపై బహిరంగంగానే తన అసంతృప్తిని పవన్ కల్యాణ్ వ్యక్తం చేసిన విషయాన్ని పార్టీకి చెందిన నాయకులే గుర్తు చేస్తున్నారు. అధికార కూటమిలో ఉపముఖ్యమంత్రిగా కీలక పాత్ర పోషిస్తున్న పవన్ కల్యాణ్, రాష్ట్రంలో ప్రధానంగా పులివెందుల, పుంగనూరు, రాజంపేట వంటి ప్రాంతాల్లో జరిగిన హింసపై ప్రత్యేకంగా గళం విప్పకపోవడం ఆయన ఇమేజ్‌కు మైనస్ అవుతుందని వైసీపీ వంటి ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హింసను, దౌర్జన్యాలను తీవ్రంగా వ్యతిరేకించిన పవన్, ఇప్పుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరుగుతున్న గొడవలపై ఎందుకు దూకుడుగా స్పందించడం లేదనే ప్రశ్నలను సోషల్ మీడియాలో కొందరు లేవనెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ ఒంటరిగా కాకుండా కూటమి పరంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు వెళ్తున్నారంటున్నారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇటు పవన్ కల్యాణ్ సంయుక్తంగా స్పందిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని, కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ హింసను ప్రేరేపిస్తోందని విమర్శించారు.రాజకీయంగా ప్రత్యర్థులు దీనిని పవన్ కల్యాణ్ "మౌనం"గా చిత్రీకరిస్తూ విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, కూటమి పరంగా చూస్తే ఇది ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు-పవన్ అనుసరిస్తున్న ఉమ్మడి వ్యూహాత్మక అడుగుగా రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఎన్నికల సంఘం కొన్ని పట్టణాల్లో ఎన్నికలను వాయిదా వేసిన నిర్ణయాన్ని కూడా వారు గౌరవిస్తూ ఉమ్మడి ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు

బీహార్ :బీహార్ కి సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు నితీష్ కుమార్. ఆయనను సరిగ్గా ఆరు నెలల క్రితం సీఎం కుర్చీ నుంచి దించేశారు. అక్కడ బీజేపీ ముఖ్యమంత్రి ప్రతిష్టించబడ్డారు. నితీష్ ని రాజ్యసభ సభ్యుడిగా చేశారు. ఆయన్ని కేంద్ర మంత్రిగా చేస్తామని బీజేపీ పెద్దలు చెప్పినట్లుగా ప్రచారం సాగింది. అయితే అది జరగలేదు, సరికదా గత ఆరు నెలలుగా నితీష్ కుమార్ ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది. దీని మీద బీహార్ లో జేడీయూ నేతలు అంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలో కాంగ్రెస్ నితీష్ మీద సాఫ్ట్ కార్నర్ చూపిస్తోంది. ఇది వ్యూహాత్మకం అని అంటున్నారు.

నితీష్ పక్కా సోషలిస్ట్ :

బీహార్ మాజీ సీఎం నితీష్ సోషలిస్టు అని ఆయన సొంత రాష్ట్రం పాట్నాలో జరిగిన పార్టీ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సాఫ్ట్ కార్నర్ చూపిస్తూ మాట్లాడారు. సోషలిస్టు నాయకుడైన నితీష్ కుమార్ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నమ్మే వారితో చేతులు కలపడం బాధ కలిగిస్తోందని ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. నితీష్ పక్కా సోషలిస్ట్ అన్నారు. దీనిని బట్టి ఆయన వేరు బీజేపీ వేరు అన్నది స్పష్టంగా ఖర్గే చెప్పదలచారా అన్నది అంతటా చర్చిస్తున్నారు.

అసంతృప్తికి ఆజ్యమా :

ఇప్పటికే నితీష్ కుమార్ అసంతృప్తితో ఉన్నారని ప్రచారం అయితే సాగుతోంది. తాను కేంద్ర పెద్దలతో సరిసాటి నాయకుడిని అని ఇంకా చెప్పాలీ అంటే సీనియర్ మోస్ట్ లీడర్ అని నితీష్ భావిస్తున్నారు అన్నది కూడా చెబుతారు. అది కూడా నిజమే అన్నది తెలిసిందే. నితీష్ 1977 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ఇక ఆయన చాలా ఏళ్ళ క్రితమే కేంద్ర మంత్రి గా ఉంటూ జాతీయ రాజకీయాల్లో కీలకం అయ్యారు. అలా చూస్తే ఆయన దిగ్గజ నేతగా ఎన్డీయేలో ఉన్నారు. అలాంటి నితీష్ కుమార్ ఇపుడు ఏమీ కాకుండా ఉన్నారు అన్నది అభిమానులలో అనుచరులలో ఉంది. దానికి కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న సాఫ్ట్ కార్నర్ కూడా ఆలోచింపచేస్తోంది.

అందరితో కలసి :



వచ్చే ఎన్నికల నాటికి ఇండియా కూటమిని మరింత బలోపేతం చేయాలని ఎన్డీయే మిత్రులను తగ్గించాలని కాంగ్రెస్ ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో నితీష్ కుమార్ సోషలిస్ట్ అని చెప్పడం ద్వారా ఆయన్ని ఈ వైపునకు తీసుకుని వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా అన్నదే ఇక్కడ చర్చగా ఉంది. అంతే కాదు దేశంలో రాజకీయం మారుతోంది అని కాంగ్రెస్ హింట్ ఇస్తోంది. అందువల్ల ఇండియా కూటమిదే రేపటి రోజులు అని ధీమా వ్యక్తం చేస్తోంది. అలా ఎన్డీయేకు ప్రస్తుతం బలం ఇస్తూ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటులో తన ఎంపీల మద్దతుతో కీలకంగా ఉన్న జేడీయూ మీద ఈ సాఫ్ట్ కార్నర్ ప్రదర్శించడం అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

ఆర్ఎస్ఎస్ భావజాలం ఉంటే :

ఈ దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం కొనసాగుతున్నంతకాలం అసలు ఎక్కడా శాంతి నెలకొనదని ఖర్గే సంచలన వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల చోరీ పెద్ద ఎత్తున సాగుతోంది అని అన్నారు. పలు రాష్ట్రాల్లో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మొత్తం దేశంలో ఎన్నికల నిర్వహణలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ఖర్గే హెచ్చరించారు.

# నీరు వృథా చేస్తే రూ.5 వేలు జరిమానా..



హైదరాబాద్, సాధారణంగా వేసవిలో నీటి సమస్య తలెత్తుతుంది. కానీ ఈసారి వర్షాభావం కారణంగా నగరాల్లో అక్టోబర్‌లోనే నీటి సమస్యలు మొదలయ్యాయి. హైదరాబాద్‌లో వేసవిలో బుక్ చేసిన స్థాయిలో ఇప్పుడే ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. దీంతో నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వ పిలుపునిస్తోంది. తాగునీటిని వృథా చేసే వారిపై రూ. 5 వేలు జరిమానా విధించనున్నట్లు జలమండలి ప్రకటించింది. ఈ నిబంధన నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లకు సైతం వర్తిస్తుందని జలమండలి అధికారులు తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాకాలంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. దీంతో అక్టోబర్ నెలలోనే నీటి కొరత సమస్య మొదలైంది. ఇక వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రబీలో వరి సాగు చేయొద్దని.. విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా సెలబ్రెటీలతోనూ ప్రచారం నిర్వహించనున్నారు.భాగ్యనగరంలో డిసెంబర్ నుంచి నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉందని జలమండలి ఇప్పటికే హెచ్చరించింది. నగరానికి తాగు నీటిని సరఫరా చేసే సింగూరు, మంజీరా రిజర్వాయర్లలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రోజుకు 735 మిలియన్ గ్యాలన్ల తాగునీరు అవసరం కాగా.. జలమండలి 585 మిలియన్ గ్యాలన్లు మాత్రమే సరఫరా చేయగలగుతోంది. దీంతో చాలా ప్రాంతాల్లో లో ప్రెషర్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నీటిని జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని సూచించింది. ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నప్పటికీ.. కొందరు మాత్రం నీటి వృథా మానడం లేదు. దీంతో కార్లు కడగటం లాంటి పనులతో నీళ్లు వేస్ట్ చేసే వారిపై భారీ జరిమానాలకు నగరపాలక సంస్థలు, జలమండలి సిద్ధం అవుతున్నాయి.రాష్ట్ర జలమండలి సూచనల నేపథ్యంలో నీటిని వృథా చేస్తే రూ. 5 వేల జరిమానా విధిస్తామని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించింది. వాటర్ ట్యాంకర్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని వెల్లడించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. నీటి పొదుపు కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.హైదరాబాద్‌లో అక్టోబర్ నెలలోనే వేసవి స్థాయిలో రోజుకు 7 వేల వాటర్ ట్యాంకుల బుకింగ్స్ జరుగుతున్నాయి. దీంతో ప్రయివేట్ ట్యాంకర్ల దందా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి ట్యాంకర్ల నీటి లీకేజీల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రవాణా చేసే సమయంలో నీరు వృథాగా పోతే.. ట్యాంకర్ యజమానికి రూ. 5 వేలు జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. ఇది తొలిసారి మాత్రమే, జరిమానా విధించిన తర్వాత కూడా ట్యాంకర్ నుంచి నీరు వృథాగా పోతున్నట్లు గమనిస్తే.. ఏకంగా ట్యాంకర్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించింది. నవంబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రకటించారు. దీంతో మూతలు బిగించకుండా నీటిని మోసుకెళ్లే ట్యాంకర్లకు ఇక నుంచి తిప్పలు తప్పవు.నీటిని వృథా చేస్తే రూ. 5 వేలు జరిమానా విధించాలనే నిర్ణయం హైదరాబాద్, వరంగల్ నగరాలకే పరిమితం కాలేదు. బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజీ బోర్డు సైతం తాగు నీటిని వృథా చేసే వారికి రూ. 5 వేలు జరిమానా విధిస్తామని తొలిసారి 2024లో ప్రకటించింది. ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్లు గమనిస్తే 1916కు ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. 2024 నుంచి బెంగళూరులో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు.

### జల సంరక్షణ పనులు ప్రారంభం

చొప్పదండి, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో విబి జి గ్రామ్ జి పథకంలో భాగంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా డ్రైనేజీ, సోక్‌పిట్‌లు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణ పనులు సర్పంచ్ బీర్ల ఆనందం ఆధ్వర్యంలో చేపట్టారు.

# మన్ కీ బాత్ లోనూ మోడీ రికార్డు



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోడీ అంటే ఎన్నో రికార్డులు వెంటనే గుర్తుకు వస్తాయి. ఆయన ఇటీవలనే పాతికేళ్ళ అధికార జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. అందులో 13 ఏళ్ళు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటే 12 ఏళ్ళ నుంచి దేశానికి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఆయన గుజరాత్ కి కంటిన్యూస్ సీఎం. అంతే కాదు లాంగెస్ట్ సీఎం. అదే విధంగా దేశంలో నెహ్రూ తరువాత వరుసగా మూడు సార్లు ప్రధాని అయిన ఘనత మోడీదే. ఇక ఈ టెర్మ్ పూర్తి చేసుకుంటే ఇందిరమ్మ ప్రధానిగా పదవీ కాలాన్ని సమం చేస్తారు. ఎమ్మెల్యే కాకుండా ఎక్కడా పోటీ చేయకుండా గుజరాత్ సీఎం కావడం ఒక హిస్టరీ అయితే జాతీయ రాజకీయాల్లోకి వస్తూనే నేరుగా ప్రధాని కావడం మరో రికార్డు. తొలిసారి ఎంపీ అదే టెర్మ్ లో పీఎం ఇలా మోడీ పొలిటికల్ ట్రాక్ రికార్డు ఉంది.

రేడియో ప్రయాణంలోనూ :

ఇదిలా ఉంటే మోడీ మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం ద్వారా ఈ ఆదివారం ప్రసారంతో 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. దాంతో ఇందులో కూడా మోడీ కొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేసారు అని అంటున్నారు. పన్నెండేళ్ల క్రితం 2014 అక్టోబర్ 3న విజయదశమి పర్వదినాన మోడీ రేడియో మాధ్యమంగా చేసుకుని మన్ కీ బాత్ పేరుతో వినూత్న కార్యక్రమం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీ నెలా చివరి ఆఖరి వారం ఆయన ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో ముచ్చటిస్తారు. ఆ నెలలో దేశంలో జరిగే కార్యక్రమాలు అభివృద్ధి, సంస్కృతి, పండుగలు, క్రీడలు, యువత, మహిళకు, వ్యవసాయం ఇలా అనేక అంశాలను ఆయన తీసుకుని చర్చిస్తారు. దేశంలో వివిధ ప్రాంతాల విశిష్టత గురించి కూడా ప్రస్తావిస్తారు. అలాగే దేశంలో మారుమూల ప్రాంతాలలో ఉన్న కళాకారులను కార్మికులను విద్యార్థులను, యువతను వృద్ధులను ఎవరి దగ్గర ప్రతిభ కష్టం ఉందో వారిని తన మన్ కీ బాత్ ద్వారా కొనియాడుతూ దేశ ప్రజలకు పరిచయం చేస్తారు.

తీర్థ యాత్రలాగా :

తన పన్నెండేళ్ల మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నరేంద్ర మోడీ ఒక తీర్థ యాత్రగా అభివర్ణించడం విశేషం. ఇది నిరంతరాయంగా కొనసాగుతోందని అన్నారు. ఈ ప్రయాణంలో దేశ ప్రజలు అంతా తన సహ ప్రయాణికులుగా స్ఫూర్తిదాతలుగా ఆయన చెప్పుకొచ్చారు. శతాబ్దాలుగా దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం

# అయ్యప్ప ఆలయం నెయ్యిలో అక్రమాలు...



తిరువనంతపురం,శబరిమల అయ్యప్ప ఆలయానికి సరఫరా చేయాల్సిన 11 వేల లీటర్ల నెయ్యిని మళ్లించి.. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన ఉత్పత్తిని సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడం సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో కాంట్రాక్టర్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, లియో ట్రేడర్స్ సంస్థలకు అసలు నెయ్యిని తరలించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. నకిలీ ఇన్వాయిస్‌లు ఉపయోగించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాల వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సుమారు రూ. 2.5 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా. కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్యాప్తు కొనసాగుతోంది.కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి సరఫరా చేయాల్సిన నెయ్యి వ్యవహారంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయానికి చేరాల్సిన సుమారు 11 వేల లీటర్ల మిల్మా నెయ్యిని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన నెయ్యిని సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో రవాణా కాంట్రాక్టర్ ఎస్ఎస్ బినును కేరళ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఈ అక్రమాల వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ)కి సుమారు రూ. 2.5 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.శబరిమల ఆలయంలో స్వామివారికి నైవేద్యంగా సమర్పించే అరవణ పాయసంలో నెయ్యి కీలక పదార్థం. ఎర్ర బియ్యం, బెల్లం, నెయ్యితో తయారు చేసే ఈ తీపి ప్రసాదాన్ని భక్తులకు అందిస్తారు. ఈ పాయసం తయారీ కోసం ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కేరళ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు చెందిన మిల్మా బ్రాండ్ నెయ్యిని కొనుగోలు చేసింది. 2025 తీర్థయాత్ర సీజన్‌లో శబరిమల ఆలయానికి నెయ్యిని రవాణా చేసే కాంట్రాక్టును ఎస్ఎస్ బినుకు అప్పగించారు. అంతకుముందు పథనంతిట్టలోని మిల్మా డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును నేరుగా కేటాయించినట్లు సమాచారం. ఈ సరఫరా ప్రక్రియలో టెండర్లు లేదా కొటేషన్లు ఆహ్వానించకపోవడంపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.విజిలెన్స్ అధికారుల ఆరోపణల ప్రకారం.. శబరిమలకు పంపాల్సిన అసలు మిల్మా నెయ్యిని తమిళనాడులోని రెండు సంస్థలకు మళ్లించారు. దాని స్థానంలో తక్కువ ధర కలిగిన ఉత్పత్తిని ఆలయానికి సరఫరా చేసినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. తమిళనాడులోని ఒట్టంచత్రం ప్రాంతంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్, లియో ట్రేడర్స్ సంస్థలకు అసలు నెయ్యి చేరినట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో నకిలీ ఇన్వాయిస్‌లతో పాటు ఇతర తప్పుడు పత్రాలను ఉపయోగించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. 11 వేల లీటర్ల నెయ్యి మళ్లింపు, దాని స్థానంలో చౌక ఉత్పత్తిని సరఫరా చేసిన వ్యవహారం వల్ల ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సుమారు రూ. 2.5 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు విజిలెన్స్ అధికారులు అంచనా వేశారు. ఈ నష్టానికి సంబంధించిన తుది లెక్కలు, అక్రమాల్లో ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. శబరిమల ఆలయానికి సరఫరా చేసిన నెయ్యి కొనుగోలు ప్రక్రియ, నాణ్యతపై అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో కేరళ హైకోర్టు ఆదేశాలతో ఈ కేసు దర్యాప్తు ప్రారంభమైంది. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో ప్రత్యేక దర్యాప్తు విభాగం ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తోంది.ఈ కేసులో భాగంగా అధికారులు శుక్రవారం బినును విచారణకు పిలిచారు. విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో నమోదైన తొలి అరెస్ట్ ఇదేనని వెల్లడించారు. నెయ్యి రవాణా, సరఫరా, కొనుగోలు ప్రక్రియల్లో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై అధికారులు మరింత సమాచారం సేకరిస్తున్నారు. శబరిమల ఆలయానికి దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అక్కడ అందించే అరవణ పాయసం భక్తులకు ఎంతో ప్రాధాన్యమైన ప్రసాదం. ఈ నేపథ్యంలో ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి సరఫరాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు భక్తుల్లో తీవ్ర ఆందోళనకు కారణం అవుతున్నాయి.ఆహార పదార్థాల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు, సరఫరా గొలుసు పర్యవేక్షణ, రవాణా కాంట్రాక్టుల పారదర్శకత ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి చర్చకు తెచ్చింది. అసలు నెయ్యిని ఎక్కడికి తరలించారు.. దాని స్థానంలో ఏ ఉత్పత్తిని సరఫరా చేశారు.. ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా.. అనే అంశాలపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం కాంట్రాక్టర్ అరెస్టుతో కేసు కీలక దశకు చేరుకుంది. విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్న ఆధారాలు, పత్రాల పరిశీలన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆరోపణలు న్యాయపరంగా నిర్ధారణ కావాల్సి ఉండగా, ఆలయానికి సరఫరా చేసే ప్రసాద పదార్థాల నాణ్యత, పారదర్శకతపై ఈ కేసు దృష్టి సారించేలా చేసింది.

# ఏపీ తీరానికి అర్నబ్ తుపాను ముప్పు.. తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో భారీ వర్షాలు!



హైదరాబాద్, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వేగంగా బలపడి 'అర్నబ్' తుపానుగా మారింది. ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయ దిశలో సుమారు 650 కిలోమీటర్లు, కాకినాడకు 730 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 830 కిలోమీటర్లు, బాపట్లకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. గంటకు సుమారు 15 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తుందని పేర్కొంది. పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ సహా తూర్పు, మధ్య భారతంలోని పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.మంగళవారం నాటికి అర్నబ్ తుపాను తీవ్ర తుపానుగా మారి, ఆ తర్వాత అతి తీవ్ర తుపాను స్థాయికి చేరుకోవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్-యానాం తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115-125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా.. అప్పుడప్పుడు గాలి వేగం 140 కిలోమీటర్లకు చేరవచ్చని తెలిపారు. తుపాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు వాతావరణ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

మూడు రోజులు అత్యంత కీలకం

తుపాను నేపథ్యంలో ఈ మూడు రోజులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. తుపాను మరింత బలపడుతున్నందున ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఏపీ, యానాంలో భారీ వర్షాలు

తుపాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు పడవచ్చని ఐఎండీ అంచనా వేసింది. అక్టోబర్ 29న కూడా ఆయా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణ సహా 9 రాష్ట్రాలకు వర్ష సూచన

తుపాను తీరం దాటిన తర్వాత కూడా దాని ప్రభావం తగ్గడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. భూభాగంపైకి ప్రవేశించిన తర్వాత బలహీనపడినా.. ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ విస్తారమైన ప్రాంతాల్లో వర్షాలు కురిపించవచ్చని అంచనా వేస్తున్నారు. బుధవారం నుంచి మూడు, నాలుగు రోజుల పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్, విదర్భ, తూర్పు మధ్యప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే పరిస్థితులు ఉండొచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140